# బండి సంజయ్‌కి బుద్ధి చెప్పాలి



55వ డివిజన్‌లో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్, పక్కన మేయర్ సునీల్‌రావు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, తదితరులు

- సరికొత్త డ్రామాలతో ప్రజల ముందుకు వస్తున్నాడు నమ్మొద్దు
- స్మార్ట్‌సిటీ తెచ్చానని గుడిలో ప్రమాణం చేస్తావా
- తెలంగాణకు అన్యాయం చేసిన పార్టీలు కాంగ్రెస్, బీజేపీలు
- బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, నవంబర్ 19: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అవినీతికి పాల్పడుతున్నాడని ఆ పార్టీ అధిష్ఠానం బండి సంజయ్‌ని పదవి నుంచి తొలగించిందని, అలాంటి వ్యక్తికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడిగా టికెట్లు అమ్ముకోవడంతో పాటు పాదయాత్ర పేరిట పార్టీ ఫండ్‌ను దుర్వినియోగం చేశాడని ఆ పార్టీ అధిష్ఠానం మెడలు పట్టి గెంటేసిందని విమర్శించారు. తనకు ఎక్కడా ఎంపీ టికెట్ రాదోనన్న భయంతో ఇప్పుడు ఎమ్మెల్యేగా బరిలో దిగారని దుయ్యబట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సాయంత్రం ఆయన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి నగరంలోని 55, 37, 38వ డివిజన్లలో ప్రచారం చేశారు. ఆయా డివిజన్లలో బీఆర్‌ఎస్ శ్రేణులు, మహిళలు మంగళహారతులతో మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, బండి సంజయ్ ఎంపీగా గెలిచిన తర్వాత ఎప్పుడు ప్రజల ముఖం చూడలేదన్నారు. ప్రజలను ఓట్లు అడిగే అర్హత లేక ప్రలోభాలతో ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. నాలుగున్నర ఏళ్లలో సంపాదించిన అవినీతి సొమ్ముతో ఓటుకు రూ.20 వేలు, సెల్‌ఫోన్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. గెలిచిన తర్వాత ప్రజలను పట్టించుకోని నాయకులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను దొంగల చేతుల్లో పెట్టవద్దన్నారు. సమైక్యాంధ్ర పాలనలో పడ్డ అరిగోసలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ తెలంగాణకు అన్యాయం చేసే పార్టీలేనని పేర్కొన్నారు. ఒక్క తప్పు జరిగితే మరోసారి 50 ఏళ్ల వెనక్కి పోతామన్నారు. 50 ఏళ్ల దారిద్య్రం కావాలో పదేళ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి కావాలో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్‌లో రౌడీ షీటర్‌కు టికెట్ ఇచ్చిందని విమర్శించారు. ఆయనకు ఓటు వేస్తే మన భూములు ఉంటాయా అని ప్రశ్నించారు. వేల కోట్ల నిధులు తీసుకువచ్చి నగరాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సీసీ రోడ్లు, చౌరస్తాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దామన్నారు. నాలుగేళ్ల క్రితం గుండెపోటు డ్రామాతో ప్రజల సానుభూతి పొంది ఎంపీగా గెలిచాడని విమర్శించారు. కరోనా కాలంలో మంత్రిగా నేను మీ మధ్యలో ఉంటే ఆయన మాత్రం ఢిల్లీలో ఎంజాయ్ చేశారని విమర్శించారు. ఎంపీగా ఏం పని చేయని బండి సంజయ్‌ని ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఏం పని చేస్తాడని ప్రశ్నించారు. స్మార్ట్‌సిటీ నేనే తెచ్చానని అంటే నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. స్మార్ట్‌సిటీ తెచ్చానని గుడిలో ప్రమాణం చేస్తావా అని బండి సంజయ్‌కి సవాల్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి-హరిశంకర్, కార్పొరేటర్ కచ్చు రవి, కో-ఆప్షన్ సభ్యురాలు రమ, నాయకులు ఎం రాజేందర్, కర్రె అనిల్, చంద్రశేఖర్, రవి, వంగ హరీశ్, చిన్న, రాజు పాల్గొన్నారు.



55వ డివిజన్‌లో ప్రచారానికి హాజరైన ప్రజలు

## అమరవీరుల కుటుంబాలకు పింఛన్ ఇస్తామనడం విడ్డూరంగా ఉంది



ప్రత్యేక రాష్ట్రం ఇవ్వకుండా తెలంగాణ బిడ్డల ఆత్మబలిదానాలకు కారణమైన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఎన్నికల్లో గెలిస్తే అమరవీరుల కుటుంబాలకు పింఛన్ ఇస్తామని పేర్కొనడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, నీళ్లు, నిధులు లేక అవస్థలు పడ్డామన్నారు. స్వరాష్ట్రంలో తాగు, సాగునీటితో పాటు వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో గోదారిపై ఒక్క ప్రాజెక్టు కడితే కేసీఆర్ పాలనలో 5 ప్రాజెక్టులు కట్టామన్నారు. ఇప్పుడు ఎండకాలంలో కూడా చెరువులన్నీ మత్తళ్లు దుంకుతున్నాయని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్‌కు ఒక్క మెడికల్ కళాశాల అడిగే ఇప్పుడు నాలుగు మెడికల్ కళాశాలలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌ది అని కొనియాడారు. కరీంనగర్‌లో 500 పడకల దవాఖాన అవుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలపై ప్రేమ లేదని, మతంపై, మత విశ్వాసాలపై రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా ఎంపీగా బండి సంజయ్ ఎందుకు అభివృద్ధి పనులకు నిధులు తీసుకురాలేదని నిలదీశారు. గతంలో తాను ప్రతిపక్ష ఎంపీగా ఉన్నప్పటికీ కోట్లాది నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. మంత్రి గంగుల కమలాకర్ గెలుపు ఖరారు అయ్యిందని, కాంగ్రెస్, బీజేపీలకు కనీసం డిపాజిట్లు కూడా దక్కవని స్పష్టం చేశారు.

**-వినోద్‌కుమార్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు**

# ప్రతిపక్షాల దుష్ప్రచారం నమ్మవద్దు

- రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 19: దళిత బంధు విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని దళితులు నమ్మవద్దని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ పేర్కొన్నారు. హుజూరాబాద్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా దళిత బంధు పథకం పెడితే దళితులను ఆదుకోవడం పోయి, ప్రతిపక్ష పార్టీలు దానిపై కుట్ర చేస్తున్నాయని పేర్కొన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని 18,600 మంది లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వారు ఆర్థికంగా అభివృద్ధి చెందినట్లు పేర్కొన్నారు. దళిత బంధు ఇస్తున్నందుకు సంతోషంగా ఉన్నామని పలువురు దళితులు తెలుపుతున్నారని చెప్పారు. దళితుల ఆర్థికాభివృద్ధికి కృషి చేసిన సీఎం కేసీఆర్‌కు దళితులంతా మద్దతుగా నిలిచి, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల దుష్ప్రచారాన్ని దళితులంతా ఐక్యంగా ఉండి తిప్పికొట్టాలని సూచించారు. సమావేశంలో దళిత బంధు మండల కో-ఆర్డినేటర్ మొలుగూరి ప్రభాకర్, రీసోర్స్ పర్సన్ బత్తుల సమ్మయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్



బీజేపీ ఓబీసీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశెట్టి శేఖర్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

# బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి

- పార్టీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ ఓబీసీ నాయకుడు

కార్పొరేషన్, నవంబర్ 19: బీఆర్‌ఎస్ హయాంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని పార్టీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లికి చెందిన బీజేపీ ఓబీసీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశెట్టి శేఖర్‌తో పాటుగా వందకు పైగా మంది యువకులు ఆదివారం మంత్రి నివాసంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గంగుల కమలాకర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగినట్లు తెలిపారు. ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని, వివిధ పార్టీల నాయకులు సైతం బీఆర్‌ఎస్‌లోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కారు గుర్తును మరువద్దు



చిన్న ముల్కనూర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బంధువులు, ఎంపీపీ

- హుస్నాబాద్ ఎమ్మెల్యేగా సతీశ్‌కుమార్‌ను గెలిపించాలి
- గ్రామాల్లో ఎమ్మెల్యే బంధువుల ఇంటింటా ప్రచారం

చిగురుమామిడి, నవంబర్ 19: సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ హుస్నాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌ను గెలిపించుకోవాలని ఎమ్మెల్యే బంధువు డాక్టర్ ప్రమోద్ కుమార్, కుటుంబ సభ్యులు డాక్టర్ మాధవి, డాక్టర్ సంహిత ప్రజలను కోరారు. ఆదివారం మండలంలోని రేకొండ, చిగురుమామిడి, ముల్కనూర్, సుందరగిరి, ఇందుర్తి గ్రామాల్లో బీఆర్‌ఎస్ మహిళా ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారంలో పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన పథకాలతో పాటు నియోజకవర్గంలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ చేసిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. పదేండ్లలో మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గ రైతులకు ఎంతో మేలు జరిగిందని, కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు తీసుకువచ్చి సాగునీటి సమస్య తీర్చిన ఘనత ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కే దక్కుతుందన్నారు. ఇతర పార్టీల నాయకులు చెప్పే మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ఓటర్లకు సూచించారు. కారు గుర్తుకు ఓటేసి మరోసారి ఎమ్మెల్యేగా సతీశ్‌కుమార్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో వీరి వెంట కొత్త వినీత, బీఆర్‌ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు అందె సుజాత, మాజీ ఎంపీపీ ఆకవరం భవాని, ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి అరుణ, సర్పంచ్ రజిత, ఎంపీటీసీలు కొత్తూరు సంధ్య, పెసర జమున, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ సాంబారి భారతమ్మ, మాజీ ఎంపీటీసీ ముప్పిడి సంగీత, మహిళా నాయకులు దొడ్ల విజయ, సిద్ధి భాగ్య, ముప్పిడి శ్యామల, బీఆర్‌ఎస్ నాయకులు బుర్ర తిరుపతి, బోయిన మనోజ్, తోట సతీశ్, ఎస్‌కే సిరాజ్, చాడ వేణు మాధవ్, మహిళలు పాల్గొన్నారు. కాగా, మిగతా గ్రామాల్లోనూ జోరుగా ఇంటింటా ప్రచారం సాగింది.

## ప్రతిపక్షాల మాటలను నమ్మొద్దు

కోరుట్ల రూరల్, నవంబర్ 19: ''అది చేస్తాం.. ఇది చేస్తాం.. అని చెబుతున్న ప్రతిపక్షాల మాటలు నమ్మితే నిండా మునుగుతం. వారితో అయ్యేది లేదు.. పోయేది లేదు. వ్యవసాయానికి కాంగ్రెస్ మూడు గంటల కరెంటే ఇస్తా అంటున్నది. అది సరిపోతదా..? ఒకసారి రైతులు ఆలోచించాలి. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇచ్చే బీఆర్‌ఎస్ కావాలా..? మూడు గంటలు ఇచ్చే కాంగ్రెస్ కావాలా..? నిర్ణయం తీసుకోవాలని' కోరుట్ల అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సూచించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో రాష్ట్రాన్ని ముందంజలో నిలిపిన ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విమర్శించే ప్రతిపక్షాలు ముందు అభివృద్ధి అంటే ఏంటో తెలుసుకోవాలని, మీ పాలనలో ఏ ఒక్క పనైనా చేస్తే తెలిసేదని ఎద్దేవా చేశారు. ఇలాంటి మాటలు మాట్లాడే వారిని నమ్మితే మోసపోతామన్నారు. ఆదివారం కోరుట్ల మండలం యూసఫ్‌నగర్, ధర్మారం, తిమ్మాయిపల్లి, అయిలాపూర్, కిషన్‌రావుపల్లె, నాగులపేట, సంగెం, చిన్నమెట్‌పల్లి, కల్లూరు గ్రామాల్లో రోడ్ షో నిర్వహించగా, బీఆర్‌ఎస్ శ్రేణులు, మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు.